క్లుప్తంగా

21 నుంచి కావమ్మ, మారయ్య తిరునాళ్ల

సదుం: మండలంలోని భట్టువారిపల్లెలోని కావమ్మ, మారయ్య ఆలయంలో ఈనెల 21 నుంచి తిరునాళ్ల నిర్వహించనున్నట్టు బెస్త సంఘం నాయకులు చెప్పారు. 21న రాత్రి అభిషేకం, ఆరాధన, జంగాల కథ, 22న కల్యాణోత్సవం, జంగాల కథ, సారె పంపిణీ, 23న జంగాల కథ, అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వివరించారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

హాస్టల్ విద్యార్థినులకు వైద్య పరీక్షలు



హాస్టల్ విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జయేష్

పుంగనూరు: సంక్షేమ హాస్టళ్ల విద్యార్థినులు ఆరోగ్య సంరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ జయేష్ అన్నారు. బుధవారం స్థానిక గిరిజన సంక్షేమ హాస్టల్‌లో ఆయన వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినుల రక్త నమూనాలు సేకరించారు. వారికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసి మాట్లాడారు. ఏదైనా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పక్షంలో నిర్లక్ష్యం చేయకుండా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల గురించి, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం ఆవశ్యకత గురించి తెలియజేశారు. అలాగే రక్తహీనత వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పక్వానికి వచ్చిన కాయలకే మంచి ధర



మార్కెట్‌లో మామిడి కాయలను పరిశీలిస్తున్న హెచ్‌ఓ సాగరిక

బంగారుపాళెం: పక్వానికి వచ్చిన మామిడి కాయలను కోసి విక్రయిస్తేనే మంచి ధర వస్తుందని ఉద్యానశాఖ అధికారి సాగరిక అన్నారు. బుధవారం స్థానిక మామిడి మార్కెట్‌ను ఆమె సందర్శించారు. మండీలకు రైతులు తీసుకు వచ్చిన మామిడి కాయలను పరిశీలించారు. తోతాపురి కాయలను రైతులు ర్యాంప్‌లు, మండీలలో విక్రయించకుండా నేరుగా ఫ్యాక్టరీలకు తీసుకువెళ్లాలన్నారు. ఫ్యాక్టరీల్లో టన్నుకు రూ.1000 నుంచి రూ.1500 వరకు ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. ఇతర రకాలను మాత్రం మండీలకు తరలించి విక్రయించుకోవాలని సూచించారు. పక్వానికి వచ్చిన కాయలకు మంచి ధర ఉంటుందన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



పూజలు చేస్తున్న అర్చకులు

వెదురుకుప్పం: మండలంలో చవటగుంటలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరగనున్న మహా భారత ఉత్సవాలకు బుధవారం ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. అనంతరం సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణం నిర్వహించారు. గురువారం నుంచి ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త రాధారెడ్డి తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం భాగవతారిణి స్వర్ణలత హరికథ కాలక్షేపంతో పాటు రోజూ రాత్రి శ్రీ వెంకటేశ్వర కళా నాట్య మండలి ఆధ్వర్యంలో వీధి నాటక ప్రదర్శన ఉంటుందని చెప్పారు.

ఇంటింటా ఆరోగ్యమే ధ్యేయం



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

భాకరాపేట: ఇంటింటా అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే రాష్ట్రీయ సేవా సమితి ధ్యేయమని రాస్ అధికారి సీవీ నాయుడు పేర్కొన్నారు. బుధవారం టాటా ట్రస్టు సహకారంతో రాస్ సంస్థ, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్ చికిత్స శిబిరం చిన్నగొట్టిగల్లు మండలం దిగవూరు పంచాయతీ గాండ్లపల్లెలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళల్లో వస్తున్న కేన్సర్ లక్షణాలు ముందుగానే గుర్తించి అవగాహన కల్పించడంతో పాటు, చికిత్స అందిస్తామన్నారు. ప్రత్యేకంగా కేన్సర్‌పై అవగాహన కల్పించడంలో రాస్ సంస్థ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో 150 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. హెచ్‌ఎం ప్రకాష్‌కుమార్, రాస్ సిబ్బంది భానుకుమార్, ఉమామహేశ్వరి, సిద్ధమ్మ, భువనేశ్వరి, కవిత పాల్గొన్నారు.

పాల టెంపోల దూకుడు!

- వంద కిలోమీటర్ల వేగంతో వెళ్తున్న వైనం
- ఇప్పటికే పలు హిట్ అండ్ రన్ కేసులకు ఇవే కారణం
- డ్రైవర్ల ర్యాష్ డ్రైవింగ్ ధాటికి హడలి పోతున్న మోటార్ సైక్లిస్టులు
- పాల వ్యాన్ల డ్రైవర్లను దారిలో పెట్టేవారెవరు?



రాత్రిపూట మితి మీరిగ వేగంతో వెళ్లే పాల క్యాన్ల టాటా ఏస్ వాహనాలు(ఫైల్)

పలమనేరు: పలమనేరు–వీ.కోట రహదారిలో రాత్రిపూట పాలను రవాణా చేసే టెంపో వ్యాన్లు మోటార్ సైక్లిస్టులు, ఇతర వాహనాల చోదకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. రహదారి నిబంధనలకు పాతర వేసి, వంద కిలోమీటర్లకు పైగా వేగంతో డ్రైవర్లు వెళ్తుండడంతో రోడ్లపై మోటార్ సైక్లిస్టులు హడలిపోతున్నారు. అవి వస్తున్న తీరు చూసి రోడ్లపై వాహనచోదకులు తప్పుకోవడమో లేదా తమ బైక్‌లను పక్కకు ఆపి, అవి వెళ్లాక వెళ్లవలసిన పరిస్థితి ఉంటోంది. ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా అవి ఢీకొట్టడం ఖాయంగా కనిపిస్తోంది. మిల్క్ సిటీగా పేరున్న పలమనేరులో పదికి పైగా పాల డెయిరీలు ఉన్నాయి. వీటికి వీ.కోట, పుంగనూరు, తమిళనాడులోని గుడియాత్తం, కర్ణాటకలోని పలు ప్రాంతాల నుంచి టాటా ఏస్(మినీ టెంపోలు) 50 దాకా ఇక్కడి రహదారుల్లో పాలను డెయిరీలకు తీసుకువచ్చి ఆపై ఖాళీ క్యాన్లలో వెళుతుంటాయి. సాయంత్రం వేళల్లో ఆయా ప్రాంతాల నుంచి డెయిరీలకు వచ్చే వాహనాల డ్రైవర్లు రాత్రి 9 నుంచి 12 గంటల దాకా వారి గమ్యస్థానాలకు తిరిగి వెళుతుంటారు. ఈ సమయంలో మితిమీరిన వేగంతో, చాలా నిర్లక్ష్యంగా వాహనాలను నడుపుతున్నారు. ఎదురుగా వాహనాలు, బైక్‌లు వచ్చినా ఏమాత్రం వేగం తగ్గించకుండా వారిపైకే వాహనాన్ని తిప్పి, ఆపై పక్కకు తిప్పడం లేదా నేరుగా వచ్చేయడం చేస్తూ వారి ప్రాణాలు పోయేంతలా హడలెత్తిస్తున్నారు. దీంతో పాల వ్యానును చూస్తే బైక్‌లు నడిపే వారు రోడ్డు పక్కకు వాహనాలను ఆపేయాల్సి వస్తోంది. వీరి ధాటికి జనం బెంబేలెత్తుతున్నారు. ఇప్పటివరకూ పలమనేరు ప్రాంతంలో చోటుచేసుకున్న పలు హిట్ అండ్ రన్ కేసులు వీటి కారణంగానే జరిగినా ఇప్పటికీ పోలీసులు గుర్తించలేకపోతున్నారనే మాట వినిపిస్తోంది. ఇకనైనా ఈ ప్రాంతంలోని డెయిరీలకు పాలను తెచ్చే టాటా ఏస్ డ్రైవర్లను కట్టడి చేయాల్సిన బాధ్యత పోలీసులు, రవాణాశాఖ అధికారులపై ఉంది.

పాల వ్యాన్లపై దృష్టి సారిస్తాం



రాత్రివేళల్లో పాలక్యాన్లతో వెళ్లే టాటా ఏస్ వాహనాలు మితిమీరిన వేగంతో వెళుతున్నట్టు మాకు సమాచారం ఉంది. దీనిపై ఇప్పటికే దృష్టి సారించాం. డెయిరీలకు వెళ్లే ఆ వాహనాల లిస్ట్ తీసుకుని త్వరలో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తాం. రహదారి భద్రత సూచనలు పాటించని డ్రైవర్లపై చర్యలు తప్పవు.

– చంద్రశేఖర్, సీఐ, పలమనేరు

చర్యలు తీసుకుంటాం



రాత్రి పూట పాల టెంపోలు, మార్కెట్లకు వెళ్లే వాహనాలు మితిమీరిన వేగంతో వెళుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మేము ఏటా రహదారి భద్రతా వారోత్సవాల్లో ఈ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నా వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీనిపై డెయిరీ అధికారులతో చర్చించి ఆయా వాహనాల నంబర్లు, డ్రైవర్ల జాబితాను తెప్పించుకుంటాం. ఆ డ్రైవర్లపై చర్యలు తీసుకుంటాం.

– మధుసూన్, ఎంవీఐ, పలమనేరు

బడి ఈడు పిల్లందరూ బడిలోనే ఉండాలి



చౌడేపల్లె: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శివప్రసాద్



రొంపిచెర్ల: గానుగచింతలో పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

చౌడేపల్లె: బడి ఈడు పిల్లందరూ బడిలోనే ఉండాలని ఎంపీడీఓ శివప్రసాద్ అన్నారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మలతోపాటు హెచ్‌ఎంలు, ఐసీడీఎస్ సిబ్బంది, అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. 6 నుంచి 14 యేళ్లలోపు ఉన్న విద్యార్థినీ విద్యార్థులందరూ బడులకు వెళ్లేలా చైతన్యం తేవాలని కోరారు. జూలై 12 వరకు నెలరోజుల పాటు గ్రామీణ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామీణ స్థాయిలో పాఠశాలల అభివృద్ధి కమిటీ, ప్రజాప్రతినిధులు, విద్యా సంక్షేమ సహాయకుల సహాయం తీసుకోవాలని సూచించారు.విద్యార్థులకు అందాల్సిన పుస్తకాలు, స్టూడెంట్స్ కిట్స్, మధ్యాహ్న భోజన పథకం... ఇత్యాది వాటిపై సమీక్షించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: బడి ఈడు పిల్లలు అందరూ బడిలోనే ఉండాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా గానుగచింత గ్రామ పంచాయతీలోని కమ్మపల్లె, చల్లెంపల్లె, పెద్ద మాదిగపల్లె, దాసరిగూడెం, కల్లావారిపల్లె గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఐదేళ్లు పైబడిన పిల్లలందరూ ప్రభుత్వ బడులలో చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్, నారాయణ నాయక్, సీఆర్‌పీ రాజేంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన



బైరెడ్డిపల్లె పీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

బైరెడ్డిపల్లె: స్థానిక పీహెచ్‌సీలో బుధవారం వైద్యాధికారులు విజయ్‌చంద్ర, శాలినీ రక్తహీనత వలన కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ సాధారణ రక్తకణాలు గుండ్రంగా ఉంటాయని, అనీమియా వ్యాధిగ్రస్తులకు రక్తకణాలు యు ఆకారంలో ఉంటాయన్నారు.

రక్తకణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగడం వంటి లక్షణాలతో బాధపడుతున్న పక్షంలో రక్తహీనత సమస్యగా భావించి వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. తగిన సమయంలోనే వైద్యాధికారుల సలహాలు పాటిస్తే ఆరోగ్యం విషయంలో ఎలాంటి ఆందోళన చెందనవసరం లేదన్నారు. మంచి ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది సావిత్రమ్మ, సారామతి, లక్ష్మి, జిలానీ పాల్గొన్నారు.

గంగమ్మా.. కరుణించమ్మా!



అమ్మవారికి పూజలు

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ ఇందిరమ్మకాలనీలో బుధవారం రాత్రి గంగమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి అమ్మవారి శిరస్సును విశేషంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. బుధవారం తెల్లవారుజామున నడివీధిలో ఏర్పాటు చేసిన మండపంలో గంగమ్మను కొలువుదీర్చారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. రాత్రి అమ్మవారిని బాణసంచా పేలుళ్ల సందడి నడుమ జల ప్రవేశానికి తరలించారు. అలాగే మండలంలోని పాలేరు దళితవాడలో బుధవారం రాత్రి గంగమ్మను యువత కేరింతల నడుమ జలప్రవేశానికి తరలించారు.

సుస్థిర జీవనోపాధుల కల్పనే లక్ష్యం

తొట్టంబేడు : మహిళలకు సుస్థిర జీవనోపాధుల కల్పనే లక్ష్యంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సెర్ప్ లైవ్లీ హుడ్స్ డైరెక్టర్ పద్మావతి అన్నారు. శ్రీకాళహస్తి మండల వెలుగు కార్యాలయంలో బుధవారం నియోజకవర్గం పరిధిలోని శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాల ఏపీఎంలు, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎస్‌వీఈపీ రుణాలను వందశాతం రికవరీ చేసి, వాటిని సుస్థిర జీవనోపాదుల కల్పనకు అవసరమైన రుణాలను మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన మహిళా సభ్యులు వ్యాపారాలు ప్రారంభించేందుకు, విస్తరించేందుకు పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ, స్త్రీనిధి, ఉన్నతి బ్యాంకుల ద్వారా రుణాలు అందించనున్నట్లు తెలిపారు. ప్రతి మండలం నుంచి ఆగస్టు మొదటివారంలోపు వంద మందికి తక్కువ కాకుండా మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. సంఘాల సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, సెర్ప్ ఎఫ్‌పీవో డీపీఎం శ్రీనివాసులు, పీఈ శేఖర్, జిల్లా స్త్రీనిధి ఏజీఎం హేమంత్‌కుమార్, ఎఫ్‌పీవో ఎపీఎంలు సింగన్న, ఆదినారాయణ, ఏసీ ధనంజయరెడ్డి, ఏపీఎంలు మునెయ్య, గురుమూర్తి, పళని, నరసింహులు పాల్గొన్నారు.

భక్తాగ్రేసురుడిపై శ్రీరాముని అభయ ప్రదానం



హనుమంతుడిపై విహరిస్తున్న శ్రీరాముడు, స్వామి వారికి నిర్వహిస్తున్న ఉయ్యాలసేవ

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు శ్రీకోదండ రామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి హనుమంత వాహనంపై విహరిస్తూ భక్తులను శ్రీరామచంద్రమూర్తి కటాక్షించారు. ఉదయం ఆలయంలో శ్రీసీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. సాయంత్రం సీతారామలక్ష్మణుల ఉత్సవమూర్తులకు ఉయ్యాలసేవ నేత్రపర్వంగా నిర్వహించారు. తదుపరి ఉత్సవమూర్తులకు అభిషేక పూజలు నిర్వహించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. రాత్రి హనుమంత వాహన సేవను ఘనంగా నిర్వహించారు. ఉభయదారులు చెన్నైకి చెందిన కుమార్‌వేల్ కుటుంబ సభ్యులు పూజాసామగ్రి, వివిధ రకాల ప్రసాదాలు, సుగంధభరిత పుష్పాలను మంగళవాయిద్యాలు, మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించి, హనుమంత వాహనంపై కొలువుదీర్చి, పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు సమర్పించారు.

నేడు శేష వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు ఉంటాయి. సాయంత్రం ఊంజల్ సేవ, రాత్రి శేష వాహన సేవ జరుగుతుందని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.సిద్ధేశ్వర రెడ్డి, తెలిపారు.

ఎనీమియా నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం



పలమనేరు: టి.వడ్డూరులో ఎనీమియాపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

–సికిల్‌సెల్ ఎనీమీయాపై అవగాహన ర్యాలీ

పలమనేరు: 2047 నాటికి దేశంలో సికిల్‌సెల్ ఎనీమియా సంపూర్ణ నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పలమనేరు మండల మెడికలాఫీసర్ మల్లికార్జున రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని టి.వడ్డూరులో ఎనీమియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఈ వ్యాధి ఎక్కువగా ఉందన్నారు. ఈ వ్యాధి సోకిన వారిలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోపభూయిష్టంగా ఉంటాయన్నారు. దీనివలన వారికి తగిన ఆక్సిజన్ అందకుండా పోతుందని, ఫలితంగా కండరాల నొప్పులు, తీవ్రమైన అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, సులభంగా సోకే అంటు వ్యాధులకు కారణమవుతుందని వివరించారు. ఈ లక్షణాలతో బాధపడుతున్న వారు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాల్సి ఉంటుందన్నారు. ఇదే అంశంపై స్థానిక ప్రభుత్వ పాఠశాలలోనూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మధు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



పలమనేరు: విద్యార్థులకు అనీమియాపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మల్లికార్జున రెడ్డి



గంగవరం: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి శ్రీనివాసులు

గంగవరంలో..

గంగవరం: సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం బుధవారం గంగవరం, పత్తికొండ పీహెచ్‌సీల్లో నిర్వహించారు. వైద్యాధికారులు శ్రీనివాసులు, మల్లికార్జునరెడ్డి దీనిపై ప్రజలకు అవగాహన కల్పించారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి జన్యుపరంగా తల్లిదండ్రుల నుంచి మాత్రమే సంక్రమిస్తుందని, ఇది అంటు వ్యాధి కాదన్నారు. శరీరంలో తరచూ రక్తకణాల సంఖ్య తగ్గడం(రక్త హీనత), కళ్లు పసుపు రంగులోకి మారడం, ఒళ్లు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, తరచూ వచ్చే అంటువ్యాధులు..మొదలైనవి ఈ వ్యాధి లక్షణాలని వివరించారు. ఇలాంటి లక్షణాలతో ఎవరైనా బాధపడుతున్న పక్షంలో సమీపంలోని ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించుకోవాలని కోరారు. తద్వారా వైద్య సాయంతో రోగులు తమ జీవన ప్రమాణాలను మెరుగుపరుచు కునేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థులకు క్లినికల్ శిక్షణ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపల్ క్రిష్ణారావు

గుడుపల్లె: వైద్య విద్య కళాశాలలో నర్సింగ్ విద్యార్థులు నైతిక విలువలు పాటించాలని కళాశాల ప్రిన్సిపల్ హెచ్‌ఆర్ క్రిష్ణారావు అన్నారు. బుధవారం పీఈఎస్ కళాశాలలో 2023–2024 సంవత్సరం అడ్మిషన్లు పొందిన నర్సింగ్ విద్యార్థులకు క్లినికల్ శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన మాట్లాడారు. నర్సింగ్ విద్యార్థులకు వైద్యులు కన్నా సమాజంలో ఎంతో గౌరవం ఉందన్నారు. వృత్తిలో నైతిక విలువలు పాటించిన నర్సింగ్ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. రోగుల ఆరోగ్య సంరక్షణకు నర్సులు వెన్నెముకలాంటి వారని పేర్కొన్నారు. అనంతరం నర్సింగ్ విద్యార్థులతో దీపాలు వెలిగించారు. వృత్తి ధర్మాన్ని పాటించడం ఒక ప్రమాణంగా స్వీకరించాలని వారికి మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో పీఈఎస్ యూనివర్సిటీ ప్రిన్సిపల్ అరుల్‌మెజిల్, సూపరింటెండెంట్ సుబ్రమణ్యా, వైద్యులు అభిరామి, డేనియల్ సుభాష్ సింగే, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గోన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన పూలగెరిగ, అమ్మవారి శిరస్సుతో చేస్తున్న నృత్యాలు

వి.కోట: మండలంలోని దాసార్లపల్లెలో గంగమ్మ జాతరను బుధవారం వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి గ్రామంలో ఆలయం ముందు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామస్తులను అలరించాయి. అలాగే ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో ప్రవేశించి భక్తులు మొక్కులు చెల్లించారు. అమ్మవారి శిరస్సును తలపై పెట్టుకుని అగ్నిగుండంలో ప్రవేశించారు. ఇక పూల గెరిగతో పుర వీధుల్లో డప్పులు, మంగళవాయిద్యాల హోరు నడుమ ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయం వద్ద భక్తులు పొంగళ్లు పెట్టారు. అనంతరం అమ్మవారిని జల్లి కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై సంబరాలు చేసుకున్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలు భేష్



ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న పద్మావతి

తిరుపతి రూరల్: తిరుపతి ప్రాంతంలో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు భేషుగ్గా ఉన్నాయని సెర్ప్ రాష్ట్ర డైరెక్టర్ పద్మావతి అభినందించారు. తిరుపతి రూరల్ మండలం వేమూరు గ్రామంలో దామా అయ్యప్పనాయుడు వ్యవసాయ క్షేత్రాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఇక్కడ పాటిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను ఆమె పరిశీలించారు. వర్మీ కంపోస్ట్ తయారీ, పట్టుపరిశ్రమ, మామిడి, పీఎండీఎస్ విధానాలపై ఆయన అవలంబిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను అడిగి తెలుసుకున్నారు. తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయంతో ఎంత ఆదాయాలను ఆర్జిస్తున్నారు? అనే అంశాలపై ఆరా తీశారు. డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, శ్రీనివాస్, అయ్యప్పనాయుడు, ధనంజయరెడ్డి, ఏపీఎం ఆదినారాయణ, అధికారులు పాల్గొన్నారు.

అర్జున తపస్మాన్



తపస్సుమానుపై నుంచి విసిరిన పూలు, నిమ్మకాయల కోసం ఎగబడుతున్న భక్తులు

పాలసముద్రం: మండలంలో కృష్ణజిమ్మాపురంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహాభారతయజ్ఞంలో భాగంగా బుధవారం రాత్రి ద్రౌపదీ మానసంరక్షణ, అర్జున తపస్మాన్ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. మెదవాడ గ్రామానికి చెందిన అర్జున వేషధారి భాస్కర్ మెట్టు, మెట్టుకూ పరమ శివుడిని వేడుకుంటూ, పద్యాలు ఆలపిస్తూ, తపస్సుమానును అధిరోహించాడు. సంతానం లేమితో బాధపడుతున్న మహిళలు తపస్సు మాను వద్ద సాగిలపడి వరపడ్డారు. అర్జునుడు తపస్సుమాను పైనుంచి పూలు, నిమ్మకాయలు, వీబూది పండ్లు విసరడంతో వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. మండలంలోని గ్రామాలతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వచ్చారు.